క్లుప్తంగా

వధూవరులకు ఆశీర్వాదం


నూతన వధూవరులతో ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ

అట్లూరు : మండలంలోని కామసుముద్రం గ్రామంలో చిన్నపాములేటి, మహాలక్ష్మిల కుమారుడు నరసింహ వివాహం శనివారం జరిగింది. ఈ వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా డీఎల్‌డీఏ చైర్మన్ మాధవరెడ్డి, జిల్లా కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


ఎమ్మెల్సీ గోవిందరెడ్డిని సన్మానిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

పోరుమామిళ్ల : మండలంలోని అక్కలరెడ్డిపల్లెకు చెందిన మేరెడ్డి రామ్మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని రామ్మోహన్‌రెడ్డి సత్కరించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూతు కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, ఎంపీటీసీ రవి, నాయకులు గురివిరెడ్డి, రవీంద్రారెడ్డి, మౌలాలి, యోహాన్, పెంచలయ్య, రమణారెడ్డి, పిచ్చయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అధ్యాపకుడికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అధ్యాపకుడు లక్కినేని మరియదాసు

ప్రొద్దుటూరు : స్థానిక ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న లక్కినేని మరియదాసుతోపాటు ఆయన సతీమణి నందిత రోడ్డు ప్రమాదంలో శనివారం గాయపడ్డారు. గాయపడిన ఇరువురిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. స్థానిక గోకుల్ నగర్‌లో నివాసం ఉంటున్న అధ్యాపకుడు మరియ దాసు, ఆయన సతీమణి నందిత స్కూటీలో స్వగ్రామమైన పోరుమామిళ్ల మండలం ఈదులపల్లె గ్రామానికి వెళుతుండగా కేశలింగాయపల్లె పెట్రోలు బంకు వద్ద కారు ఢీకొంది. 108 వాహనంలో గాయపడిన భార్యాభర్తలను ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోటి సంతకాల పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్లను శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆవిష్కరించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఈనెల 28న నియోజకవర్గం కేంద్రమైన మైదుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడాన్ని నిరసిస్తూ నియోజకవర్గ వ్యాప్తంగా 60 వేల సంతకాలను సేకరిస్తామన్నారు.

నరకానికి రా‘దారులు’

- బురద, గుంతలు, కంకరతేలి అధ్వానం
- నరకప్రాయంగా మారిన ప్రయాణం
- పట్టించుకోని అధికారులు

అసలే అధ్వాన రోడ్లు.. ఆపై వర్షాకాలం. ఇంకేముంది చిన్న చిన్న వానలకే పల్లె రోడ్లు పూర్తిగా ఛిద్రమయ్యాయి. ఈ మట్టి రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి బురదమయంగా మారాయి. దీంతో వాహనదారులు ఆ రోడ్లపై ప్రయాణించాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. ఇక పాదచారుల పరిస్థితి మరీ అధ్వానం. ఈ రోడ్లపై ప్రయాస లేకుండా ప్రయాణం చేయలేని పరిస్థితి నెలకొంది. అక్కడక్కడున్న బీటీ రోడ్లకు మరమ్మతులు లేకపోవడంతో అవి కూడా పూర్తిగా ధ్వంసమైపోయాయి.

బద్వేలు : ఏ రోడ్డు చూసినా ఏముంది గర్వకారణం .. అంతా గతుకుల మయం.. ఆపై భయం భయం ..! బద్వేలు నియోజకవర్గంలోని గ్రామాల రహదారుల దుస్థితి ఇది. ప్రధాన మార్గాలు కూడా అధ్వానంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగంలో చలనం లేకపోవడంతో వాహనచోదకులు, ప్రయాణికులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. గ్రామీణ ప్రాంత రోడ్లు నరకానికి నకళ్లుగా మారాయి. దీంతో పల్లెవాసులు రోడ్లపై వెళ్లాలంటేనే హడలిపోతున్నారు. ఇక వర్షాలు పడితే రోడ్లపై ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లడానికి వీలులేకుండా ఉంటోందని వాహనదారులు వాపోతున్నారు. బద్వేలు మండల పరిధిలోని గూడెం నుంచి తిమ్మరాజు పల్లె గ్రామానికి వెళ్లే రహదారి స్వాతంత్ర్యం వచ్చి నప్పటి నుంచి నేటికీ తారురోడ్డు వేసిన వేసిన ఆనవాళ్లు లేవు. కొంగలవీడు నుంచి తిప్పనపల్లె, జోగిరెడ్డిగారిపల్లె, కలసపాడు నుంచి పోరుమామిళ్ల ప్రధాన రహదారి, కలసపాడు నుంచి తెల్లపాడు రోడ్డు దారుణంగా మారాయి. పెద్దపెద్ద గుంతలు ఏర్పడి రోడ్డు ఆనవాళ్లు కన్పించకుండా పోయాయి.


కంకర తేలిన కొంగలవీడు-జోగిరెడ్డివారిపల్లె రోడ్డు


కలసపాడు-పోరుమామిళ్ల రహదారిపై నిలిచిన వర్షం నీరు

హడలిపోతున్న వాహనదారులు

పోరుమామిళ్ల నుంచి మైదుకూరు వెళ్లే రోడ్డు మరీ దారుణంగా తయారైంది. ఓబులాపురం నుంచి కాశినాయ జ్యోతి క్షేత్రం వరకూ రోడ్డు ఆధ్వానంగా మారింది. ఇక గ్రామాల్లో ఉన్న అంతర్గత రోడ్లు పూర్తిగా దెబ్బతిని ప్రజలకు, వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. గోతుల రహదారుల్లో ప్రయాణించడానికి జనం పడుతున్న బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఒళ్లు హూనమవడం ఒకెత్తయితే, గోతుల్లో పడి తీవ్ర గాయాలపాలవుతున్న జనం పరిస్థితి చెప్పక్కర్లేదు. వర్షాలకు రోడ్లన్నీ గుంతల్లో నీరు చేరి చెరువులుగా మారాయి. రోడ్డు ఏదో.. చెరువు ఏదో తెలియదన్నంత దారుణంగా రహదారులు తయారయ్యాయి. ఈ రోడ్లపై ప్రయాణించాలంటే ద్విచక్రవాహనదారులు బెంబేలెత్తుతున్నాయి. మండలంలో ఇవే కాకుండా ప్రతి గ్రామానికి వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిని అధ్వానంగా తయారయ్యాయని, కనీసం ఇప్పటికైనా ఈ గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండిస్తూ నిరసన

మైదుకూరు : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడిని ఖండిస్తూ శనివారం మైదుకూరులో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక కడప రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్, వీహెచ్‌పీఎస్ నాయకులు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం న్యాయ వ్యవస్థపై, రాజ్యాంగంపై దాడి చేసినట్లేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబు, జిల్లా ఆర్గనైజ్ సెక్రటరీ జోనస్, ఎంఈఎఫ్ నాయకులు, సీపీఐ, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు

ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించాలి

మైదుకూరు : రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించాలని శనివారం మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో జరిగిన ప్రధాన మంత్రి దన, ధాన్య కృషి యోజన ప్రారంభోత్సవంలో తెలిపారు. ప్రధాని మోదీ, పీఎం ధన ధాన్య కృషి యోజన, జాతీయ పప్పు దినుసుల మిషన్ను ప్రారంభించడాన్ని రైతులు లైవ్‌లో వీక్షించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పురుగు మందుల వాడకం వలన భూమిలో సారం తగ్గిపోయి వాటి అవశేషాలు మనషుల్లో దుష్ప్రభావాలను చూపిస్తున్నాయన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించి పంటలను సాగు చేయాలని సూచించారు. దేశంలో ఉత్పత్తి చేసిన వస్తువుల్ని వినియోగించి స్వదేశీ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ విధానంలో జీవామృతం, ఘన జీవామృతం, నీమాస్త్రం, జీవాస్త్రం, దశపర్ని కషాయాన్ని తయారు చేసే విధానాలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. అజోస్పైరిలం, ట్రైకోడెర్మా, సుడిహెష్ తదితర జీవ శిలీంద్రాలను ఉపయోగించి రైతులు పంట ఉత్పత్తుల దిగుబడిని పెంచుకుని అధిక ఆదాయాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కేవీకే అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ, మైదుకూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఏపీ రవీంద్ర, ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి గోవర్ధన్‌రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ విజయనిర్మల, డాక్టర్ బీఎస్ కాంతిశ్రీ, డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్, రైతు నాయకులు పాల్గొన్నారు.


పీఎం ధన్య ధాన్య కృషి యోజన ప్రారంభాన్ని వీక్షిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు

మార్పు మనతోనే మొదలవ్వాలి

మైదుకూరు : సమాజంలో ఏదైనా మార్పు మనతోనే మొదలవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి అన్నారు. స్థానిక కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ప్రశాంతి ‘బాలికగా నాతోనే మార్పు’ అనే అంశంపై మాట్లాడుతూ బాలికల అభివృద్ధిపై ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. బాలికా సంరక్షణ విభాగం అధికారి ప్రసన్న మాట్లాడుతూ బాల్య వివాహాల గురించి, చైల్డ్ హెల్ప్ లైన్ గురించి వివరించారు. ఈ సందర్భంగా బాలిక అనే అంశం మీద పాఠశాల విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి

స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

గోపవరం : మండలంలోని సెంచురీ పానెల్స్ పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేసి కార్మికులను నిలువుదోపిడీకి గురికాకుండా నియంత్రించాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబర్ ఎస్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం పార్టీ బృందం ఆధ్వర్యంలో సెంచురీ పానెల్స్ పరిశ్రమను పరిశీలించి అక్కడ పనిచేస్తున్న కార్మికుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమకు భూములు తీసుకునేటప్పుడు భూములిచ్చే వారికి ప్రతి కుటుంబంలో ఏదో ఒక రకంగా ఉద్యోగం ఇస్తామని, మొదటి ప్రాధాన్యతగా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి పరిశ్రమ ప్రారంభించిన తర్వాత ఆ ప్రాంతవాసులకు మొండిచేయి చూపించారని మండిపడ్డారు కార్యక్రమంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు అనిల్, రామరాజు, విజయరావు, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు

సమాజ హితం కోసం పుట్టిందే ఆర్‌ఎస్‌ఎస్

చాపాడు : ఆర్‌ఎస్‌ఎస్ సమాజ హితం కోసం పుట్టిందని.. వందేళ్లు పూర్తి చేసుకుని శతాబ్ది ఉత్సవాలను జరుపుకోవడం గొప్ప విషయమని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్ తెలిపారు. మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం వద్ద శనివారం ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా విజయదశమి ఉత్సవం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ అంటే మతతత్వం కాదని రెడీ ఫర్ సెల్ఫ్ సర్వీస్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ భారతీయ మనుగడలో సమాజ హితం కోసం పాటుపడుతుందన్నారు. 40 లక్షల మంది ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ ద్వారా సమాజానికి ఎంతో మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సహకార్య వాహ్ శ్రీనివాసులరెడ్డి, జిల్లా కార్యవాహ్ ప్రసాద్, మండల ప్రముఖ్ చంద్రబాబురెడ్డి, వివేకానంద విద్యాసంస్థల చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పెరుగు వీరనారాయణ యాదవ్

ఉల్లి రైతులందరికీ పరిహారం ఎందుకు వర్తించదు

మైదుకూరు : ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం రైతులందరికీ ఎందుకు వర్తించదని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రశ్నించారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉల్లి రైతులకు చంద్రబాబు ప్రకటించిన హెక్టారుకు రూ.50 వేలు పంట నష్టపరిహారం కేవలం కర్నూలు జిల్లాకే పరిమితం చేయడం శోచనీయమన్నారు. ఎకరాకు రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక రైతులు చేలల్లోనే వదిలేస్తున్నారన్నారు. కోసిన పంటను వంకల్లో పారబోస్తున్నారన్నారు. తాము బాధిత రైతులను పరామర్శించి వారికి న్యాయం చేయాలని కోరామన్నారు. దానిపై మైదుకూరు ఏఎంసీ చైర్మన్ రైతులను రెచ్చగొడతున్నారని ఆరోపించడం సరికాదన్నారు. రైతులపై ప్రేమ ఉంటే మార్కెట్ యార్డులో ఉల్లి పంటను కొనుగోలు చేస్తామని బోర్డు, ఫ్లెక్సీ కట్టి ఎందుకు కొనలేదని ప్రశ్నించారు. అది రైతులను మోసం చేయడం కాదా అన్నారు. ‘ప్రభుత్వం మీది అధికారులు మీ చేతుల్లో ఉన్నారు.. అయినా రైతులకు ఎందుకు న్యాయం చేయడం లేదని’ ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో 2021, 2022లో రైతుల నుంచి కేపీ ఉల్లి పంటను క్వింటాల్ రూ.5 వేలతో కొనుగోలు చేసి ఆదుకున్నామని గుర్తు చేశారు. పసుపు, వరి పంటను కూడా కొనుగోలు చేశామన్నారు. అంతకుముందు టీడీపీ ప్రభుత్వంలో ఆదినారాయణరెడ్డి మంత్రిగా ఉండగా కేపీ ఉల్లిని రూ.1200కు కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. మార్కెట్ కమిటీల్లో ఉల్లి పంటను కొనుగోలు చేస్తున్నట్లు పెట్టిన ఫ్లెక్సీలపై శుక్రవారం కలెక్టర్‌ను కలిసి అడిగామని తెలిపారు. పంట నష్టపరిహారం చెల్లింపులో జిల్లాల వారీగా రైతుల పట్ల ఎందుకు పక్షపాతం చూపుతున్నారని అడిగామని పేర్కొన్నారు. ఆయన సరైన సమాధానం చెప్పలేదన్నారు. పంట కొనుగోలుపై తమకు ఆదేశాలు రాలేదని కలెక్టర్ సమాధానం ఇచ్చారన్నారు. కలెక్టర్ స్పందిస్తూ జిల్లా రైతులకు కూడా పంట నష్టపరిహారం అందించాలని కోరుతూ తాము ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారని తెలిపారు. జిల్లా రైతులకు కూడా ఆ పరిహారాన్ని అందించి, న్యాయం చేయాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ మూలే సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, ఎస్సార్ బాల నరసింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

సర్వ మానవాళి హక్కుల కోసం పోరాటం

ప్రొద్దుటూరు క్రైం : సర్వ మానవాళి హక్కుల కోసం కలిసి పోరాటం చేద్దామని ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం పిలుపునిచ్చారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం సమీపంలోని ఎస్ఆర్ కల్యాణ మండపంలో శనివారం ఎంపీజే రాయలసీమ ప్రాంతీయ మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన షేక్ సలీం మాట్లాడుతూ ఎంపీజే కుల, మత, లింగ వివక్ష లేకుండా సర్వ మానవాళి హక్కుల కోసం పోరాటం చేస్తుందన్నారు. ఎంపీజే సుప్రీం కౌన్సిల్ కన్వీనర్ అబ్దుల్ ఖదీర్ నేటి సామాజిక పరిస్థితులు, ఎంపీజే సామాజిక ఆవశ్యకత గురించి వివరించారు. ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఎంపీజే ఎప్పుడూ ముందుండి ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని తెలిపారు. ఏపీసీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు పిచ్చుక శ్రీనివాస్ మాట్లాడుతూ అమాయక ప్రజలపై తప్పుడు కేసులు పెడుతూ బడాబాబులను కేసుల నుంచి తప్పించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయాన్ని తుంగలో తొక్కుతున్నాయని చెప్పారు. ఎంపీజే రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కేఎం అబ్దుల్ సుభాన్, జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ రఫిక్ మాట్లాడుతూ ఎంపీజే సంస్థ అన్ని వర్గాల కోసం పని చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీజే రాయలసీమ ఇన్‌చార్జి ఆయూబ్ ఖాన్, జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణాధ్యక్షుడు హుస్సేన్‌బాషా, ఎంపీజే సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ రఫిక్

అభివృద్ధి పనులను ఎందుకు పూర్తి చేయడం లేదు

మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అభివృద్ధి పనులను టీడీపీ కూటమి నాయకులు ఎందుకు పూర్తిచేయడం లేదని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రశ్నించారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీపై కూటమి నాయకులకు శ్రద్ధ లేదని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి 16 నెలలు అయినా మైదుకూరు మున్సిపాలిటీపై కూటమి నాయకులు వివక్ష చూపుతున్నారని విమర్శించారు. అంతకు ముందు అధికారంలో ఉన్న 2014–19లో కూడా వారు మైదుకూరును అభివృద్ధి చేయలేదన్నారు. చంద్రబాబు ఖాజీపేట బహిరంగ సభలో మైదుకూరు అభివృద్ధికి రూ.5 కోట్లు ప్రకటించినా ఆ మొత్తాన్ని పూర్తిగా ఇవ్వలేదన్నారు. మైదుకూరును వారు అభివృద్ధి చేయరు చేసేవాళ్లను చేయనివ్వరని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ వేసి రూ.226.40 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. తమ ప్రభుత్వం మొదటి విడతగా రూ.74.70 కోట్లు నిధులు ఇచ్చిందని, రెండో విడత రూ.12 కోట్లు, మరో దఫాలో రూ.12 కోట్లు ఆ విధంగా దాదాపు రూ.100 కోట్లతో పనులు ప్రారంభించామని వివరించారు. ఆ నిధులతో మురికి నీటి శుద్ధి ప్లాంట్, కేసీ కాలువపై క్రాసింగ్ వంతెనలు, కర్ద్రీల వంక ఆధునీకరణ, చెరువు అలుగు వంకతోపాటు మరో రెండు వంకల అభివృద్ధికి టెండర్లు వేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. మొత్తం నిధుల్లో రూ.20 నుంచి 25 కోట్ల మేరకు పనులు జరిగాయన్నారు. అంతలోనే ఎన్నికలు వచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు ఆ పనులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. పాత కాంట్రాక్టర్లతో సమస్య అనుకుంటే రద్దు చేసి కొత్తగా టెండర్లు వేసి పనులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఈ 16 నెలల్లో మున్సిపాలిటీలో ఏం అభివృద్ధి చేశారని చెప్పాలంటే ఒక ఎన్టీఆర్ విగ్రహం మాత్రమే పెట్టారని పేర్కొన్నారు. ప్రజల గుండెల్లో కొలువై ఉన్న ప్రజా నాయకుడికి డ్రైనేజీపైన విగ్రహం పెట్టడం ఎంత వరకు సబబు అని అన్నారు. అసలు డ్రైనేజీలను ఆక్రమించి విగ్రహాలు పెట్టకూడదన్నారు. ఇక అభివృద్ధి గురించి చెప్పాలంటే చేసిన పనులకు బిల్లులు రావడం లేదని టీడీపీ కౌన్సిలర్లే చెబుతున్నారని అన్నారు. అన్న క్యాంటిన్ కడితే బిల్లులే రాలేదని సంబంధిత కౌన్సిలర్ మున్సిపాలిటీ సమావేశంలో ఆవేదన వ్యక్తం చేయలేదా అని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చింది అభివృద్ధి పనులు చేయవచ్చుకున్నామని.. ఇప్పుడు ప్రజల వద్దకు వెళ్లలేకున్నామని మరో కౌన్సిలర్ గోడు వెళ్లబోసుకోలేదా అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కేవలం సంక్షేమ పథకాల కోసమే రూ.కోట్లు ఖర్చు చేశామన్నారు. కుల మతాలకు, పార్టీలకు అతీతంగా పథకాలను అమలు చేశామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

నీట మునిగిన పొలాలు


నీట మునిగిన పొలంలో కౌలు రైతు సంజీవరాయుడు

మైదుకూరు : మండలంలోని వనిపెంటకు చెందిన పలువురు రైతులు సాగు చేసిన పంట పొలాలు గురు, శుక్రవారం కురిసిన భారీ వర్షాల కారణంగా నీట మునిగాయి. వనిపెంటకు చెందిన మురికి శ్రీరాములు, గోవిందమ్మ, మురికి సురేష్, సురేంద్ర, రాము, సుధాకర్, కౌలు రైతులు కోటపాటి సంజీవరాయుడు, సుబ్రహ్మణ్యం, రాజశేఖర్ అనే వారికి చెందిన సుమారు 20 ఎకరాల పొలాంలో సాగు చేసిన అరటి, పసుపు, ఉల్లిం పంటలు నీట మునిగిపోయాయి. భారీ వర్షాలతో వనిపెంట నుంచి చెర్లోపల్లెకి వెళ్లే రహదారిలో ఉన్న వారి పొలాల్లోకి చేరి నీరు దిగువ పొలాల గుండా వెళ్లాల్సి ఉంది. అయితే దిగువనున్న రైతులు అందుకు సహకరించకపోవడంతో నీరు తమ పొలాల్లోనే ఉండిపోయిందని కౌలు రైతు సంజీవరాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులుగా నీరు పొలాల్లోనే ఉండటంతో సాగు చేసిన పంటలు పనికి రాకుండా పోయాయని తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

శ్రీభాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : శ్రీభాగ్ ఒప్పందాన్ని అమలు చేసి రాయలసీమకు న్యాయం చేయాలని రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకట సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయలసీమ అభివృద్ధికి, సీమప్రజల సంక్షేమానికి శ్రీభాగ్ ఒడంబడిక అమలు ఒకటే మార్గమని దీనిని అమలు చేసి సీమ ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. శ్రీభాగ్ ఒడంబడిక అమలు పరచని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్షానికి వ్యతిరేకంగా నవంబరు 11వ తేదీన కర్నూలులోని అంబేడ్కర్ భవన్‌లో ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి రాయలసీమ ప్రజలందరు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి

అట్లూరు : మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో పనిచేసే శ్రామికులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, ఉపాధి హామీ పథకం ఏపీఓ జయచంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో నకిలీ, బినామీ పేర్లను కట్టడి చేసేందుకు, పారదర్శకతను పెంచే క్రమంలో కేంద్ర ప్రభుత్వం ప్రతి ఉపాధి హామీ పథకం శ్రామికునికి ఆధార్ ఈకేవైసీ తప్పనిసరి చేసిందని వారు పేర్కొన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో సంబంధిత క్షేత్ర, సాంకేతిక సహాయకులు ద్వారా పది రోజులుగా ఆధార్ ఈకేవైసీ చేస్తున్నట్లు తెలిపారు.

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమంలో న్యాయవాది సుమంత్ కుమార్ తన తల్లి చంద్రలీమ్మ వర్ధంతి సందర్భంగా శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది బాలాజీ, చిట్టిబాబు, వృద్ధాశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పోరుమామిళ్ల : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ పోరుమామిళ్ల మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పుల్లయ్య, జయరామిరెడ్డి కోరారు. శనివారం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలైనా ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి ఆర్థిక పరమైన విషయాలపై అసెంబ్లీలో చర్చించకుండా కాలయాపన చేయడం తగదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా 12 వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి, 30 శాతం ఐఆర్, పెండింగ్‌లో 4 డీఏలు ప్రకటించాలని కోరారు.

ప్రైవేట్ ట్రావెల్స్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : జిల్లాలో నిబంధనలను పాటించని ప్రైవేట్ ట్రావెల్స్‌పై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరీకుమార్, విశ్వనాథ్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఫిట్‌నెస్ సరిగా లేకపోవడంతో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. శుక్రవారం ఎర్రగుంట్ల ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బ్రేక్ ఫెయిల్ అయిందని, అయితే ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రైవేట్ బస్సు తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదం జరిగిన సంఘటనను గుర్తు చేశారు. అధిక చార్జీలు వసూలు, బస్సుల ఫిట్‌నెస్ సమస్య, డ్రైవర్లపై ఒత్తిడి వంటి సమస్యలపై రోడ్డు రవాణా శాఖ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యాప్ ద్వారా స్కాన్ చేయాలి

ప్రొద్దుటూరు : మద్యం బాటిల్ ఒరిజినల్‌దా నకిలీదా అని స్కాన్ చేస్తే తెలుస్తుందని ప్రొద్దుటూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ సీవీ సురేంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీటీఏటీఎస్ అనే యాప్ ద్వారా స్కాన్ చేస్తే మద్యం బాటిల్ వివరాలు వస్తాయని పేర్కొన్నారు. మద్యం షాపులను తరచూ తనిఖీ చేస్తున్నామని, నకిలీ మద్యం ప్రొద్దుటూరులో లేదని తెలిపారు.